క్లుప్తంగా

ఆక్రమణలను అడ్డుకోండి



డీటీ శ్రీదేవికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక ఆక్రమణలకు గురికాకుండా అడ్డుకోవడంతో పాటు ఎలాంటి నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని శ్మశాన వాటిక స్థల పరిరక్షణ కమిటీ నాయకులు గణేష్, బీఎల్ నారాయణ, బజారి, రంగన్న, రామస్వామి కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడుకునేందుకు మున్సిపల్, రెవెన్యూ అధికారులచే సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే అందుకు సంబంధించిన స్కెచ్ ఇవ్వలేదని దాన్ని సత్వరం ఇవ్వాలని కోరారు. శ్మశాన వాటిక స్థలంలో ఆక్రమణలను తొలగించాలని కోరారు. సభ్యులు రామచంద్ర, వెంకటేష్, యాపిలయ్య, రవి, కృష్ణ, గిడ్డయ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొర్లి హనుమప్ప (65) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. లోబీపీ కారణంగా ఆకస్మికంగా కుప్పకూలి కింద పడిపోయాడు. స్థానిక వైద్యుడికి చూపించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చిన్న వర్షానికే మడుగు



పత్తి టీఎంసీలో చేరిన వర్షపు నీరు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో చిన్న వర్షం వచ్చిందంటే పత్తి టీఎంసీలో చిత్తడిగా మారుతోంది. టీఎంసీలో కొన్ని చోట్ల లీకేజీలు, సగం టీఎంసీ లెవెల్ లేకపోవడం వల్ల చిన్న వర్షానికే నీరు నిల్వ ఉంటోంది. వర్షాకాలమైతే టీఎంసీలో మొత్తం చిత్తడిగా వర్షపునీటితో నిండుతోంది. ప్రస్తుతం అన్ సీజన్ కావడంతో మార్కెట్‌కు పత్తి దిగుబడులు తగినంతగా రాలేదు. సీజన్‌లో పత్తి దిగుబడులు వచ్చినప్పుడు వర్షం వచ్చిందంటే పత్తి తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఇప్పటికైనా మార్కెట్‌యార్డు అధికారులు పత్తి టీఎంసీలో లీకేజీలకు మరమ్మతులు చేసి ఇబ్బంది లేకుండా చూడాలని కమీషన్ ఏజెంట్లు, రైతులు కోరుతున్నారు.

బాలుడికి అస్వస్థత

ఆదోని అర్బన్: డివిజన్ పరిధిలోని పత్తికొండకు చెందిన ప్రవీణ్ అనే మూడేళ్ల బాలుడు బుధవారం రాత్రి ఇంట్లో ఉన్న ఆల్‌అవుట్ లిక్విడ్ తాగడంతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే బాలుడిని తండ్రి రాము ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడికి చికిత్స అందిస్తున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేత జట్టుకు ట్రోఫీ అందించిన నిర్వాహకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం ఏబీఎం చర్చి 17వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఏపీతో పాటు తెలంగాణ, గుజరాత్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు, ట్రోఫీలను దాతల చేతుల మీదుగా అందించారు. విజేత తెలంగాణ(మాలమల్ల) జట్టు రూ.60 వేలు, తరువాతి స్థానాల్లో నిలిచిన ప్యాపిలి జట్టుకు రూ.50 వేలు, ప్రకాశం జట్టుకు రూ.40 వేలు, ప్రకాశం జిల్లా మరో జట్టుకు రూ.30 వేలు, వైఎస్సార్ జిల్లా జట్టుకు రూ.25 వేలు, గుజరాత్ జట్టుకు రూ.20 వేలు, తిరుపతి జట్టుకు రూ.15 వేలు, లక్ష్మీపురం జట్టు రూ.10 వేలు బహుమతులను గెలుచుకున్నట్లు నిర్వాహకులు రమేష్, కునాల్, వెంకటస్వామి, జాన్, శేఖర్, గంగన్న, గోపాల్, సుంకన్న, బాబ, అభిలాష్, శ్రీకాంత్ తెలిపారు. దాతలను, గ్రామ పెద్దలను చర్చి సంఘ సభ్యులు శాలువాలతో సత్కరించారు. స్థానిక కార్పొరేటర్ నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, నాగేంద్రబాబు, భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మికాంతరెడ్డి పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్.బండ తండాలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీపై సిబ్బందితో కలిసి దాడి చేసి నిల్వ ఉంచిన 750 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు బుధవారం తెలిపారు. బట్టీ నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

బడి బస్సు భద్రమేనా?

- పాఠశాలల ప్రారంభానికి మునుపే తనిఖీ చేయించుకోవాల్సిందే
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాహనం రోడ్డెక్కితే కఠిన చర్యలు
- డివిజన్ పరిధిలో 150 స్కూలు బస్సులు
- ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకున్నవి 49 బస్సులు మాత్రమే
- జిల్లాలో 550కుపైగా విద్యా సంస్థల బస్సులు
- ఈనెల 15వ తేదీతో ముగిసిన గడువు
- పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు ఎఫ్‌సీలు జారీ



బస్సు కండీషన్‌ను పరీక్షిస్తున్న ఎంవీఐ సిసిరాదీప్తి

ఆదోని అర్బన్: మరో 20 రోజుల్లో పాఠశాలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులను తరలించే పాఠశాలల బస్సుల కండీషన్‌పై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. ముఖ్యంగా ప్రతి బస్సుకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసి ధ్రువపత్రం ఇస్తున్నారు. సర్టిఫికెట్ లేకుండా ఏ బస్సు రోడ్డెక్కడానికి వీలులేదని ఆదేశాలు జారీ చేసింది. అలాగే డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం, 60 ఏళ్లకు మించకుండా వయసు, ఆరోగ్యవంతుడై ఉండాలని సూచించింది. ఈ మేరకు వైద్యులతో పరీక్షలు చేయిస్తోంది. ఇక బస్సుల రూపురేఖలు, నిబంధనలను ఇప్పటికే ప్రకటించింది. దీంతో సంబంధిత అధికారులు బస్సుల సామర్థ్య పరీక్షల్లో బిజీగా ఉన్నారు.

చిన్నారుల విద్యకు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లలను చదివించే తల్లిదండ్రులు విద్యాసంస్థ నివాసానికి దూరంగా ఉంటే స్కూలు బస్సుల్లో పంపిస్తుంటారు. చిన్నారుల చదువు ఎంత ముఖ్యమో భద్రత కూడా అంతే ప్రధానం. చిన్నారుల భద్రతకు పూర్తి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ఉంది. కాలం చెల్లిన బస్సులను నడిపితే విద్యార్థులకు ముప్పు పొంచి ఉంటుంది. పాఠశాలలు పునఃప్రారంభం అయిన నేపథ్యంలో ప్రయివేట్ విద్యాసంస్థల బస్సుల సామర్థ్యం (ఫిట్‌నెస్)పై రవాణా శాఖ అధికారులు దృష్టి సారించారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.

బస్సులకు పరీక్షలు

గతేడాది మే 15వ తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు వాహనాలను తనిఖీ చేసి (ఫిట్‌నెస్ సర్టిఫికెట్) ఎఫ్‌సీలను అధికారులు జారీ చేశారు. ఈ ఏడాది గడువు ఈనెల 15వ తేదీతో ముగిసింది. అయినా బస్సుల ఎఫ్‌సీపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి పాఠశాల, కళాశాల యాజమాన్యాలు బస్సులకు ఎఫ్‌సీ పొందాల్సి ఉంది. అనుమతులు లేకుండా బస్సులు రోడ్డు ఎక్కితే సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆర్టీఓ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో 550కి పైగా స్కూలు బస్సులు ఉన్నాయి. డివిజన్ పరిధిలో 150 బస్సులు ఉన్నాయి. అందులో ప్రస్తుతం 49 బస్సులు ఎఫ్‌సీ పరీక్షలు చేయించుకున్నాయి. ఇంకా 101 బస్సులు ఎఫ్‌సీ చేయించుకోవాల్సి ఉంది. 2023లో ఎఫ్‌సీ చేయించుకోని 50 బస్సులకు జరిమానా విధించి, కేసులు నమోదు చేశారు. రవాణా అధికారులు వీటికి సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రూల్ నం.185 ఎఫ్ నిబంధనల ప్రకారం బస్సు కండీషన్‌తో పాటు లైట్లు, కిటికీల వద్ద గ్రిల్స్ వంటి వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. అన్ని సవ్యంగా ఉంటేనే ఆ బస్సులకు ఎఫ్‌సీ సర్టిఫికెట్‌ను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జారీ చేస్తున్నారు. ఎఫ్‌సీ కలిగిన బస్సులు మాత్రమే విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చాలి.

ఈ నిబంధనలు తప్పనిసరి

- స్కూల్ బస్సుకు ఎడమ వైపున పాఠశాల పేరు, సెల్‌ఫోన్ నంబర్, చిరునామా పూర్తిగా కనిపించేలా ఉండాలి.
- డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలకు మించరాదు.
- డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి
- డ్రైవర్లు మూడు నెలలకోసారి షుగర్, బీపీ, కంటి పరీక్షలు చేయించుకొని ఆరోగ్య సమస్యలు లేవనే సర్టిఫికెట్ సమర్పించాలి. దానిని బస్సులో ఉంచుకోవాలి.
- ప్రతి బస్సుకు అటెండర్ ఉండాలి. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల వివరాలు తప్పనిసరిగా ఉండాలి.
- బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలను ఉంచాలి.
- బస్సుకు తలుపులు ఉండడంతో పాటు అత్యవసర ద్వారం పనిచేసేటట్లు చూసుకోవాలి.
- కిటికీలకు మధ్య రెండు లోహపు కడ్డీలను అమర్చాలి. బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు విద్యార్థుల అటెండెన్స్ తీసుకోవాలి.
- బస్సు నుంచి పొగ రాకుండా చూడాలి. బ్రేక్ కండీషన్‌లో ఉండాలి.
- స్పీడో మీటర్ పని చేయాలి. స్టీరింగ్, టైర్లు కండీషన్‌లో ఉండాలి. డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- సామర్థ్యాన్ని మించి విద్యార్థులను ఎక్కించరాదు. బస్సు బయలుదేరే సమయం, ఆగే స్థలాలు రూట్ ప్లాన్‌లో ఉండాలి.
- పిల్లలు సులువుగా బస్సు ఎక్కేందుకు వీలుగా ఫుట్‌బోర్డు ఏర్పాటు చేయాలి.
- పాఠశాల బస్సు పసుపు రంగులోనే ఉండాలి.
- అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం భద్రపరుచుకునే బాక్సులు, సబ్ రూల్స్ ఏ, బీ ప్రకారం తప్పనిసరిగా పాటించాలి.
- 15 సంవత్సరాల సర్వీసు పూర్తయిన వాహనాలకు అనుమతి ఉండదు.
- డ్రైవర్ల ప్రవర్తనపై దృష్టి సారించాలి

“ అనుమతి తప్పనిసరి



విద్యాసంస్థల బస్సుల ఎఫ్‌సీ గడువు ఈనెల 15వ తేదీతో ముగిసింది. జూన్ 12వ తేదీ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు, కళాశాలల బస్సుల ఎఫ్‌సీ జారీ చేసేందుకు తనిఖీలు చేస్తున్నాం. అనుమతులు లేకుండా బస్సులు రోడ్డు ఎక్కితే కఠిన చర్యలు తీసుకుంటాం. గతేడాది 50 విద్యాసంస్థల బస్సులకు ఎఫ్‌సీలు తీసుకోలేకపోవడంతో కేసులు నమోదు చేశాం. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాం. – సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎంవీఐ

“ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలి



పాఠశాలలు, కళాశాలలు తెరిచేలోపు బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి ధ్రువపత్రాలు పొందాలి. ఫిట్‌నెస్ చేయించకుండా రోడ్డుపైకి వచ్చే బస్సుల కోసం ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా తిరిగే బస్సులను, ఫిట్‌నెస్ లేకుండా రోడ్డుపై తిరిగే బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యాసంస్థల యాజమాన్యాలు తమ బస్సులను సెలవులకు ముందే సామర్థ్య పరీక్షలు చేయించాలి. – సిసిరాదీప్తి, ఎంవీఐ

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీర

నందవరం: ఉపాధి పనుల్లో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ 20 ఎకరాల మేరకు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, ఏపీడీ అల్లిపీర సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి ఆధార్ కార్డును అనుసంధానం చేయించాలన్నారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఆధార్ అనుసంధానం, బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ పూర్తయితేనే ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాలకు నగదు జమ అవుతుందని వివరించారు. అలాగే చిన్న, సన్నకారు రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి, ప్రభుత్వం అందించే రాయితీలను వివరించి, హార్టికల్చర్ పంటల సాగును ప్రోత్సహించేలా కృషి చేయాలన్నారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూలి పెంచాలని వినతి



అశోకానందరెడ్డికి డిమాండ్ నోటీసు ఇస్తున్న కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

ఆదోని రూరల్: కార్మికులకు కూలి రేట్లను పెంచాలని ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న, ఫర్టిలైజర్ హమాలీ సంఘ గౌరవాధ్యక్షుడు కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ.. ఆదోని ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ హమాలీ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల క్రితం కార్మికులకు అగ్రి ఇన్‌పుట్స్ యాజమాన్యానికి కుదిరిన ఒప్పందం కొద్ది రోజుల్లో ముగుస్తున్నందు వల్ల పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకొని కార్మికుల కూలి రేట్లను పెంచాలన్నారు. ఈ మేరకు డిమాండ్ నోటీసును అగ్రి ఇన్‌పుట్స్ యాజమాన్యం తరఫున ఎస్‌వీఎఫ్ అశోకానందరెడ్డికి అందజేసినట్లు చెప్పారు. కార్మికులకు మెరుగైన కూలీ రేట్లను ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ప్రతి సంవత్సరం రెండు జతల దుస్తులు ఇవ్వాలని కోరారు. ఎస్‌వీఎఫ్ హమాలీలు రామాంజిని, ధణాపురం భీమన్న, శ్రీనివాసులు, దేవేంద్ర, నరసింహులు, రామదాసు, నాగరాజు, ముక్కన్న, తాయప్ప, చిన్న, ఈరన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



స్వామి వారి ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కోసిగి: మండల ప్రజల ఆరాధ్య దైవం కడపాళెం వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ (కోసిగయ్య) స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువజాము నుంచి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరాములు, అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసరాజు దొర ఆధ్వర్యంలో వేదపండితులు జయతీర్థ ఆచార్, రఘునందన్ ఆచార్ నేతృత్వంలో పందిరి వేసి వేదమంత్రోచ్ఛరణలు, మేళతాళాల మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు నారికేలాలు సమర్పించి పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయం నుంచి తేరుబజారు మైదానం వరకు ఊరేగింపుగా వచ్చి అక్కడ వేదపండితులు జయతీర్థ ఆచార్ ఉత్సవమూర్తులతో ప్రభోత్సవంపై ఆశీనులయ్యారు. అక్కడ హారతులు పట్టి నారికేలాలు సమర్పించి ప్రభోత్సవాన్ని తిరిగి గమ్యస్థానానికి చేర్చారు. ఆలయ ఈఓ దినేష్‌కుమార్, సిబ్బంది కేవీ సుబ్బయ్య ఆచారి, బసవరాజు దొర పాల్గొన్నారు. గురువారం వైశాఖ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని తేరుబజారు మైదానంలో సాయంత్రం స్వామి వారి మహా రథోత్సవం నిర్వహించనున్నారు.

ముందస్తు అడ్మిషన్లు నిలిపివేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను నిలిపివేసి ఆయా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జీఓను తుంగలో తొక్కి ముందస్తు అడ్మిషన్లు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంఘ నాయకులు వీరప్రతాప్, ఇమ్రాన్, ప్రేమ్‌కుమార్, యుగంధర్, మహమ్మద్ కైఫ్ పాల్గొన్నారు.

అలసందగుత్తిలో కార్డెన్ సెర్చ్

ఆదోని రూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో బుధవారం ఆదోని రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో కర్ణాటక మద్యం అమ్మేవారు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు చేశారు. గ్రామవీధుల్లో సిబ్బందితో కవాతు నిర్వహించి, ముఖ్య కూడలిలో ప్రజలతో సమావేశమై మాట్లాడారు. సీఐ మాట్లాడుతూ.. ఎన్నికలు ఫలితాలు వెలువడిన తర్వాత గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లలో అమ్మరాదని షాపుల యజమానులను ఆదేశించారు. పోలీసుల ఆదేశాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దతుంబళం, ఇస్వీ ఎస్ఐలు చిన్న పీరయ్య, శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గర్భిణులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



చిన్నటేకూరులో వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: గర్భిణులు ప్రతి నెలా తప్పనిసరిగా పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చిన సమయం నుంచి వారి ఆరోగ్యం పట్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నెలా సక్రమంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. కాన్పు జరిగే రోజులను అంచనావేసి ముందస్తుగానే ఆస్పత్రుల్లో చేరేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిదే అన్నారు. రక్తపోటు, మధుమేహం, రక్తహీనత లాంటి సమస్యలున్నా, హైరిస్క్ గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రసవ ప్రణాళిక పక్కాగా నిర్వహించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు గర్భిణులు, బాలింతల ఇళ్లను సందర్శించి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలన్నారు. కుటుంబ వైద్య కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి నెలనెలా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే నివారణకు చికిత్స అందించాలన్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం ద్వారా గర్భం దాల్చిన మహిళకు మొదటి కాన్పులో రూ.5000 నగదు ప్రోత్సాహం అందిస్తారని వివరించారు. రెండో కాన్పులో ఆడ శిశువు జన్మనిచ్చిన మహిళకు మరోసారి రూ.5000 నగదు ప్రోత్సాహం అందిస్తారని చెప్పారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు



కున్నూరులో ఓ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న సీఐ రామకృష్ణయ్య

గోనెగండ్ల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్, ఆ తర్వాత గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ రామకృష్ణయ్య హెచ్చరించారు. ఆయన బుధవారం మండలంలోని కున్నూరు గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్తులనుద్దేశించి సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో ఎలాంటి గొడవలు, అల్లర్లు చేయకుండా అందరూ కలిసిమెలసి ఉండాలన్నారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల అనంతరం ఎవరైనా అల్లర్లకు దిగడం, గొడవలకు పాల్పడడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. స్థానిక పోలీసులు వెంట ఉన్నారు.

కౌంటింగ్ రోజున నిషేధాజ్ఞలు



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున ఎలాంటి సంబరాలు, ర్యాలీలు చేపట్టరాదని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఆయా పార్టీల నాయకులు ప్రశాంతంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

దర్గాలో భక్తుల సందడి

కౌతాళం: ఖాదర్‌లింగస్వామి ఉరుసులో భాగంగా బుధవారం ప్రసాదం పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. అలాగే ఖాదర్‌లింగ స్వామి శిష్యులుగా మారడం (గురుబోధ) తీసుకోవడం ఇక్కడ అనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బుధవారం పలువురు ఖాదర్‌లింగ స్వామి శిష్యులుగా మారారు. శిష్యులుగా మారిన తర్వాత ఎలాంటి చెడు పనులు చేయరాదని, ఐదుపూటల నమాజు చేసి అందరికి మంచి బోధన చేయాల్సి ఉంటుందని ధర్మకర్త మున్నపాషా తెలిపారు. వీరికి తీర్థం అందించి శిష్యులుగా మార్చారు. పీఠాదిపతి ఖాదర్ బాష చిష్టీ, అలాగే దర్గా పదవ ధర్మకర్త సయ్యద్ సాహెబ్‌పీర్ వుసేని చిష్టీ బోధన గదిపై జెండాను ఎగరవేశారు. ధర్మకర్త మున్నపాషా మాట్లాడుతూ.. దర్గా 10వ ధర్మకర్తగా తన తండ్రి సాహెబ్‌పీర్ వుసేని చిష్టీ 41 ఏళ్ల పాటు సేవలందించారని గుర్తు చేశారు. రెండేళ్లుగా ఆయన బోధన చేసిన గదిపై జెండాను ఎగురవేస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో ఉరుకుంద రస్తాలో ఖాదర్‌లింగ స్వామి 40 రోజుల పాటు తపస్సు చేసిన కట్ట వద్ద జెండాను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కట్ట వద్ద జెండాను ఆవిష్కరిస్తే వర్షం కురుస్తుందని అపార నమ్మకం ఉందన్నారు. ఇందులో భాగంగానే శిష్యులు, గ్రామస్తులతో కలిసి వెళ్లి జెండా ఆవిష్కరించినట్లు తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఖవ్వాలి పోటీలను ఘనంగా నిర్వహించారు. గుల్షన్ కమిటీ అధ్యక్షుడు మున్నపాషా, గ్రామ పెద్దలు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



ఖాదర్‌లింగ స్వామి కట్ట వద్ద జెండా ఆవిష్కరణ, ఫాతెహాలు చేస్తున్న భక్తులు

సహజ పద్ధతుల్లో మాగబెట్టడం మేలు

- కృత్రిమంగా మాగబెట్టిన పండ్లతో ఆరోగ్య సమస్యలు



ఎమ్మిగనూరురూరల్: భారతదేశం పండ్ల ఉత్పత్తిలో ప్రపంచంలో రెండవ స్థానం ఉందని, అరటి, మామిడి పండ్ల ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కో–ఆర్డినేటర్ అశోక్‌కుమార్, ఉద్యాన శాస్త్రవేత్త మౌనిక వెల్లడించారు. పండ్లను మాగబెట్టడంతో సహజ పద్ధతులు పాటించాలని వారు సూచిస్తున్నారు. మామిడి పండ్లను కృత్రిమంగా రసాయనాలను వినియోగించి మగ్గబెట్టడం వలన ఆరోగ్యానికి హాని కలుగుతుందని, క్యాల్షియం కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లు ఆకర్షణీయమైన రంగు ఉన్నప్పటికీ తక్కువ రుచి, వాసన కలిగి త్వరగా పాడైపోతాయని చెప్పారు. దీనికి బదులుగా సహజ పద్ధతుల్లో మామిడిని మాగబెట్టవచ్చని సూచించారు.

అరటి, మామిడిని సహజ పద్ధతిలో మాగబెట్టే విధానం

వరిగడ్డిలో మాగబెట్టడం, కాల్షియం కార్బైడ్‌కు బదులుగా మామిడి పండ్లను పిపిఎం ఇథలిన్ వాయువు కలిగిన వాతావరణంలో 24 గంటలు ఉంచి తరువాత గది ఉష్ణోగ్రత వద్ద 5 రోజుల్లో మాగబెట్టవచ్చు. అదేవిధంగా అరటిని 100 పిపిఎం ఇథలిన్ వాయువు కలిగిన వాతావరణంలో 18 గంటలు ఉంచి గది ఉష్ణోగ్రత వద్ద 4 రోజుల్లో మాగబెట్టవచ్చు. ఈ పద్ధతిలో 1 ఘ.మీ ఘనపరిమాణం గల చట్రాన్ని చెక్కతో గానీ ప్లాస్టిక్ పైప్‌తో గానీ నిర్మించాలి. చట్రం చుట్టూ గాలి చేరని విధంగా పాలిథిన్ షీట్ లేదా థార్పలియన్ షీట్ చుట్టాలి. తరువాత చట్రంలో మూడొవంతు పక్వానికి వచ్చిన పండ్లను ప్లాస్టిక్ క్రేటర్లో నింపి ఉంచాలి. తరువాత ఒక చిన్న పాత్రలో 2 మి.లీ 30 శాతం శుద్ధితో కలిగిన ఎథ్రిల్ ద్రావణాన్ని తీసుకొని దానికి 0.5 గ్రాముల సోడియం హైడ్రాక్సైడ్ గుళికలు కలిసి క్రేట్ల పక్కన ఉంచి గాలి చొరబడని విధంగా పాలిథిన్ లేదా థార్పలిన్ మూత గట్టిగా కట్టాలి. ఈ మిశ్రమం నుంచి విడుదలయ్యే ఇథలిన్ వాయువు పండ్లను మగ్గడానికి దోహదపడుతుంది. ఈ మిశ్రమం చేతులకు గానీ పండ్లకు గానీ తగలకుండా జాగ్రత్త వహించాలి. కృతిమ పద్ధతిలో పండ్లను మగ్గబెట్టడానికి బదులు ఇథలిన్ వినియోగంతో సహజ పద్ధతిలో మాగబెట్టడం చక్కటి ప్రత్యామ్నాయం అని కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడించారు.